క్లుప్తంగా

సన్మానం



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన తక్కళ్లపల్లి రవీందర్‌రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికైన నేపథ్యంలో అశోక్‌నగర్, అయోధ్యనగర్ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం అయోధ్యనగర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బలరాంనాయక్ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధిని వివరించాలని తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమాల్లో సొసైటీ డైరెక్టర్ అచ్యుతం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

గీసుకొండ : మండలంలోని ధర్మారం, పోతరాజుపల్లి గ్రామాల్లో వరంగల్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనకు ఎన్నికల సంఘం కేటాయించిన చెరుకు రైతు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఎంపీ సీట్ల కేటాయింపులో అన్యాయం చేసినందుకే తాను పోటీ చేస్తున్నట్టు తెలిపారు.

'ఉపాధి' కూలీలకు టవల్స్ పంపిణీ



దుగ్గొండి : ఎండల తీవ్రత నేపథ్యంలో మండలంలోని నాచినపల్లి మాజీ సర్పంచ్ మమత భర్త రాజు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సుమారు 400 మంది కూలీలకు సోమవారం సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన టవల్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని కూలీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జయ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తలపెట్టిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ప్రకాశ్‌రావు ప్రకటించారు.

ఎంపీటీసీలు హాజరైనా..

సంగెం : ఎంపీటీసీలు హాజరైనా అధికారులు హాజరు కాకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో తలపెట్టిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ఎంపీపీ కళావతి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్న నేపథ్యంలో సభకు హాజరు కాలేదని ఆమె చెప్పారు.

వార్డు కౌన్సిలర్‌కు మాతృవియోగం

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురం గ్రామానికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు తల్లి ఆగమ్మ (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఆమె మృతదేహానికి గౌడ జన హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, రాష్ట్ర నాయకుడు సోల్తి సారయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి బొడిగె మల్లేశం, కార్యదర్శి కొండి రాము, గందసిరి సాంబరాజు, మేర్గు రమేశ్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వర్ధన్నపేట : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం సమ్మేళనం నిర్వహించారు. అంతా కలుసుకుని ఆటపాటలతో సందడి చేశారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులైన దశరథం, జనగం భిక్షపతి, వెంకట్‌రెడ్డి, సంజీవరావు, సదానందం, వెంకటేశ్వర్లులను ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడారు. సమాజ సేవల్లో భాగస్వాములవుతామని చెప్పారు. తమ స్నేహితుల్లో కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని తెలిపారు. అబ్దుల్ అజీం, పంజా కృష్ణ, రమేశ్, ధరావత్ సంతోశ్, అనిత, రేణుక, రజిని, రవళి, రాధిక పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు

- కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు అక్కెంపేటలోని ఆరోగ్య ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆత్మకూరు గ్రామానికి దూరంగా ఉంటుంది. దీంతో కనీస వైద్య అవసరాలు ఆరోగ్య ఉపకేంద్రం ద్వారా అందుతున్నాయి. ఇందులో వైద్య సిబ్బందితోపాటు ఆశ కార్యకర్తలు సేవలందిస్తున్నారు. దీర్ఘకాలిక రోగులకు నిత్యం వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. అలాగే చిన్నపిల్లలకు టీకాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. అయితే వైద్య సేవలు అందిస్తున్న సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు లేకపోవడంతో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.



ఆత్మకూరులో అద్దెభవనంలో ఆరోగ్య ఉపకేంద్రం

పక్కాభవనం నిర్మించాలి



మండల కేంద్రంలోని సబ్‌సెంటర్ అద్దె భవనంలో కొనసాగుతోంది. అందులో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. దీంతో ఇబ్బందులు ఎదర్కోవాల్సి వస్తుంది. సబ్‌సెంటర్‌కు పక్కా భవనాన్ని నిర్మించాలి.

– పరికిరాల చంద్రమోహన్

నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర నాయకుడు కాళీప్రసాదరావు

దామెర: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని ఊరుగొండ శివారులోగల పెద్ద చెరువులో ఉపాధిహామీ పనులు చేపడుతున్న ఊరుగొండ, దమ్మన్నపేట గ్రామాల కూలీలతో సోమవారం ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మొద్దని సూచించారు. అనంతరం కూలీలకు అరటిపండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ పొడాల మధుకర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు సమ్మిరెడ్డి, పరుశరామ్, బూత్ అధ్యక్షుడు రాజు, చరణ్, అన్వేష్, శ్రీను, సుధాకర్, కార్యకర్తలు, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న కాళీప్రసాదరావు

తండ్రిపై తనయుడి దాడి

ఐనవోలు : భూమి అమ్మిన డబ్బుల విషయంలో గొడవ జరగగా తండ్రిపై కుమారుడు కర్రతో దాడి చేశాడు. ఈ సంఘటన మండలంలోని ముల్కలగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై గైకడి అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలగూడెం గ్రామానికి చెందిన గ్యారంపల్లి అనంతరావు భూమి విక్రయించాడు. డబ్బుల విషయంలో కుమారుడు రత్నాకర్‌తో గొడవ జరిగింది. దీంతో రత్నాకర్ తండ్రి అనంతరావుపై కర్రతో దాడిచేశాడు. అనంతరావు చేయికి బలమైన గాయం అయ్యింది. దీంతో రత్నాకర్‌పై కేసు నమోదు చేసి వరంగల్ కోర్టుకు తరలించగా అతనికి 14 రోజుల కస్టడీ విధించినట్లు ఎస్సై అనీల్ కుమార్ తెలిపారు.

కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మధుకర్



దామెర : బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని దుర్గంపేట్ గ్రామానికి చెందిన పొడాల మధుకర్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సోమవారం వెల్లడించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందించారు. మధుకర్ ప్రస్తుతం ఊరుగొండ పీఏసీఎస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు రావు పద్మ, రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు

ఆర్థికసాయం

చెన్నారావుపేట : ఎల్లాయగూడెంకు చెందిన గీత కార్మికుడు వేముల ఎల్లాగౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు రూ.3 వేల సాయం అందజేశారు. బద్దునాయక్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబయ్య పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

దామెర : వివాదంలోఉన్న వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని బాధిత రైతు అధికారులను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వెంకటాపూర్‌లో సర్వే నంబర్ 80/అ/3/1లో 21 గుంటల భూమి పార్టిషన్ విషయమై ఎర్రబెల్లి శైలజ గతంలో కోర్టును ఆశ్రయించింది. కాగా ఆ భూమి ఎవరూ అమ్మకూడదూ, కొనకూడదని కోర్టు ఆదేశించినట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయం గతంలో తహసీల్దార్ కార్యాయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె పేర్కొన్నారు. అయినప్పటికీ మార్చి 26న ఆకుల శృతి, మంతెల సాయి సృజన్‌కు రిజిస్ట్రేషన్ అయినట్లు ఆమె ఆరోపించింది. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి పాసుబుక్కు నిలిపివేయాలని డిమాండ్ చేసింది. అక్రమ రిజిస్ట్రేషన్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను వేడుకుంది. ఈ విషయమై తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవిని వివరణ కోరగా.. రిజిస్ట్రేషన్ జరిగింది వాస్తవమేనని ఆమె అన్నారు. ఆన్‌లైన్‌లో సదరు సర్వేనంబర్‌ను వెంటనే బ్లాక్ చేసి క్రయ, విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. నివేదికను ఆర్డీఓకు సమర్పించినట్లు వెల్లడించారు.

కడియం కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పాలి

వేలేరు : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గోవింద సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదని అన్నారు. మండల ఏర్పాటుతో పాటు డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిందే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రూ.104 కోట్ల నిధులతో వేలేరు మండలానికి సాగునీరు అందించే ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకువచ్చింది రాజేశ్వర్ రెడ్డి అన్నారు. దళితబంధు రాకుండా అడ్డుకున్నది కడియం శ్రీహరి అని, కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని సూచించారు. కడియం శ్రీహరికి దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలన్నారు. నాయకులు కరుణాకర్, మొగిళి, జోగు ప్రసాద్, అశోక్, సంపత్, ఫారుక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

భానుడి భగభగ.. నిర్మానుష్యంగా రోడ్లు



నిర్మానుష్యంగా బస్టాండ్ రహదారి

పరకాల : ఎన్నడూలేని విధంగా సూర్యుడు ప్రతాపం చూపుతుండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతను చూసి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. అత్యవసర పనుల కోసం ఉదయం బయటకు వచ్చి 11 గంటలలోపు ఇంటిదారి పడుతున్నారు. మళ్లీ అవసరమైతే సాయంత్రం 7గంటల తర్వాత వాతావరణం చల్లబడుతుండడంతో బయటకు వచ్చి రాత్రి 11గంటల వరకు పనులు పూర్తి చేసుకుంటున్నారు. దీంతో మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. దుకాణదారులు సైతం గిరాకీలు లేకపోవడంతో నష్టపోతున్నారు. ఎండల తీవ్రతతో గిరాకీలు లేక అద్దెలు కట్టడం కూడా కష్టంగా మారుతోందని పలువురు వాపోతున్నారు. ఎండతాపానికి భరించలేక కొందరు దుకాణదారులు షాపు ముందు నీళ్లు చల్లుతున్నారు.

నీటిని సముద్రంలోకి వదలలేదా?

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి : కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిన విషయాన్ని సాకుగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం 50 టీఎంసీల నిల్వ నీటిని సముద్రంలోకి వదిలింది నిజం కాదా? అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని ముద్దునూరు, మహ్మదాపురం, మల్లంపల్లి, తిమ్మంపేట, రేకంపల్లి, నాచినపల్లి, పొనకల్, వెంకటాపురం, దుగ్గొండి, లక్ష్మీపురం ఎంపీటీసీల పరిధిలో సోమవారం వేర్వేరుగా నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో సుదర్శన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు ఎండితే ఆ నెపాన్ని బీఆర్ఎస్‌పైకి నెట్టాలని చూస్తోందని చెప్పారు. లక్షల కోట్లు కొల్లగొట్టారని కేసీఆర్‌ను బద్నాం చేసి ప్రజల దృష్టిలో దోషిని చేసి ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని తెలిపారు. యాసంగిలో రైతుబంధు ఇవ్వలేదు, ఇతర హామీలూ అమలు చేయడం లేదని చెప్పారు. ఎన్నికల హామీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని కోరారు. మాలోతు కవితను మహబూబాబాద్ ఎంపీగా గెలిపించాలని ఆకాంక్షించారు. జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, పొన్నం మొగిలి, శానబోయిన రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విఫలం

గీసుకొండ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని ధర్మారం, జాన్‌పాక, కీర్తినగర్, గరీబ్‌నగర్‌ల్లో సోమవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాదంతో, రాష్ట్రంలోని కాంగ్రెస్ మోసపూరిత హామీలతో కేంద్రంలో గద్దెనెక్కేందుకు ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

10 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

శాయంపేట : ఈనెల 10వ తేదీ నుంచి 13 వరకు మండల కేంద్రంలోని శివమార్కండేయ స్వామి, వేంకటేశ్వరస్వామి, ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాగణంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. 10న అంకురార్పణ, 11న గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, అగ్నిస్థాపన, బేరితాడనం, ధ్వజారోహనం, మండల దేవతాపూజానం, ఎదుర్కోలు, 12న పంచామృత అభిషేకాలు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పర్వత వర్ధని సమేత శివ మార్కండేయ స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 13న షష్ఠి సుదర్శన హోమం, చండిహోమం, పూర్ణాహుతి, ధ్వజవరోహనం ఉత్సవ పరిసమాప్తి ఉంటుందని తెలిపారు. గ్రామస్తులు బాసాని లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, వనం సదానందం, బాల్నె తిలక్‌బాబు, బాసాని బాలకృష్ణ, మల్లికార్జున్, మామిడి రవి పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్, గ్రామస్తులు

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు



దామెర : పూజలు చేస్తున్న రమణారెడ్డి దంపతులు



ఐనవోలు : పట్నం వేస్తున్న పూజారులు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యపూజల అనంతరం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు స్వామి వారి ఎదురుగా నజరు పట్నం వేసి ఒగ్గు పూజలు జరిపించారు. ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేద పండితుడు పురుషోత్తమశర్మ, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

దామేశ్వరాలయంలో అన్నపూజ

దామెర : మండ కేంద్రంలోని దామేశ్వరాయంలో సోమవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని అన్నపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజేష్‌శర్మ వేదమంత్రోచ్ఛరణ నడుమ అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ధూపదీప, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, సభ్యులు పోల్సాని అనీల్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని రాంరెడ్డి, మేరుగు కుమార్, ఇంద్రారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెల్ ద్వారా ఓటుహక్కు వినియోగం

ఐనవోలు : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం తెలంగాణకు చెందిన పలువురు సశస్త్ర సీమాబల్ విభాగానికి చెందిన పారామిలటరీ సైనికులు తమ సర్వీసు ఓటుహక్కును సోమవారం వినియోగించుకున్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ జిల్లా బిలాయి వద్ద పారామిలటరీ క్యాంపులో ఏర్పాటు చేసిన పోస్టర్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో వీరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యాంపు నుంచి ఆరుగురు సహచర మిత్రులు రాజేందర్, ఎండీ రఫీ, ఎండీ ఫియాజ్‌ఖాన్, సుమలత, జగన్నాథ్‌రెడ్డి, రాజశేఖర్‌తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మండల కేంద్రానికి చెందిన పారామిలటరీ సైనికుడు రాజేష్ తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఉపాధ్యాయులందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఉడుతగూడెం పాఠశాల హెచ్ఎం చుంచుకాల లింగారావు సూచించారు. ఈనెల 8వ తేది వరకు సమయం ఉందన్నారు. సోమవారం వర్ధన్నపేట కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. 12 బీ ఫాం నింపినవారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండదని, ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతిఒక్కరూ ఈనెల 13న ఈడీసీ ద్వారా ఓటు వేసే అవకాశం ఉండనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.



ఓటుహక్కును వినియోగించుకున్న సైనికులు

కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండవర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు



ఆత్మకూరు : ప్రచారం చేస్తున్న వెంకట్రాంరెడ్డి



మాట్లాడుతున్న నల్లా మహాత్మా

శాయంపేట : కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండవర్గాలకు న్యాయం అందుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు బాసాని రవి చిందం రవి, మారెపల్లి రవీందర్, చింతల రవిపాల్, మారెపల్లి కట్టయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు : కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని కుడా చైర్మన్, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ కూలీలతో సోమవారం ఆయన మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. పరకాల నియోజకవర్గం నుంచి కావ్యకు లక్ష మెజారిటీ ఇవ్వాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి పనిరోజులను 200కు పెంచుతామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు రణధీర్‌రెడ్డి, రాజు, కుమారస్వామి, వాసు, జయ్‌పాల్‌రెడ్డి, సందీప్, ఖాజా, కిరీటి, సామెల్ పాల్గొన్నారు. అలాగే నాగయ్యపల్లిలో అసెంబ్లీ యూత్ కన్వీనర్ మాదాసి శ్రీధర్ ప్రచారం నిర్వహించారు.

పరకాల : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నల్లా మహాత్మా పిలుపునిచ్చారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు భారతదేశ భవితకు దోహదపడేవి అన్నారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బార్‌సోసియేషన్ పరకాల అధ్యక్షుడు బండెల స్వామి, శ్రీనివాస్, కృష్ణ, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభకు తరలిరావాలి

ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 8వ తేదీన వరంగల్‌లో నిర్వహించలపెట్టిన బీజేపీ సభకు మండలంలోని కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆ పార్టీ మండల కోఆర్డినేటర్ రాజవీరు, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. వరంగల్ నగరంలో 8వ తేదీన నిర్వహించతపెట్టిన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతీ ఇంటి నుంచి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రవణ్‌కుమార్, రవి, పైడి, వేణు, శివప్రసాద్, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజవీరు, శ్రీనివాస్

సేవారత్న అవార్డుకు కృష్ణప్రసాద్ ఎంపిక

నర్సంపేట : సేవారత్న నేషనల్ అవార్డు–2024కు తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట ట్రెజరరీ కార్యాలయ సీనియర్ ఆడిటర్ కృష్ణప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం ఏటా ప్రజాఉద్యమకారులకు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. జూన్ 10న మహారాష్ట్రలోని పూణెలో బహుజన రచయితల 4వ వెస్టర్న్ ఇండియా కన్వరెన్స్ నిర్వహించనున్న క్రమంలో అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యుడు తాటికంటి ఐలయ్య పాల్గొన్నారు.